సాక్షి ఒడిశా
బుధవారం, 27, ఆగస్టు, 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,22,100లు, బంగారం 1 గ్రాము 500 మిల్లీగ్రాములు, వెండి 113గ్రాముల 800 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ముంచేసిన వాన

గజపతి జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మూడు పంచాయతీల్లో ప్రజల అవస్థలు పడుతున్నారు.

- 2లో



తొలిపూజకు సర్వం సిద్ధం

వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, యువకులు సిద్ధమయ్యారు.

- 2లో

విమానయోగం



- ఒడిశాకు భారీ విమానయాన ప్రోత్సాహం
- పూరీలో అంతర్జాతీయ విమానాశ్రయం
- పౌర విమానయాన మంత్రుల సమావేశంలో సీఎం వెల్లడి



తూర్పు ప్రాంత పౌర విమానయాన మంత్రుల సమావేశంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, మురళీధర్

భువనేశ్వర్ : ఒడిశాకు విమానయోగం కలిగింది. పూరీలో అంతర్జాతీయ విమానాశ్రయం, రాష్ట్రంలో ప్రపంచ స్థాయి ఎంఆర్‌ఓ సౌకర్యం, గిరిజన బాలికలకు పైలట్ శిక్షణ కేంద్రం ఏర్పాటు కానున్నాయి. నగరంలో జరిగిన పౌర విమానయాన మంత్రుల సమావేశంలో కేంద్ర పౌర విమానయాన విభాగం మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు సమక్షంలో ముఖ్యమంత్రి రాష్ట్రానికి పలు వరాలు కురిపించారు.

పూరీ అంతర్జాతీయ విమానాశ్రయం..

పూరీ పవిత్ర పుణ్యక్షేత్రంలో జగన్నాథ్ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఖరారైంది. ఈ విమానాశ్రయం ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న లక్షలాది మంది జగన్నాథ భక్తులకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక ప్రధాన ద్వారంగా ఉపయోగపడుతుంది. పూరీలో విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్ర పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ఈ కార్యక్రమంలో ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న పర్యావరణ, అటవీ అనుమతులు త్వరలో ఆమోదం పొందే అవకాశం పట్ల ఆశాభావం వ్యక్తం చేశారు. తూర్పు ప్రాంత పౌర విమానయాన మంత్రుల సమావేశంలో భువనేశ్వర్ నుంచి దుబాయ్, సింగపూర్‌లకు ప్రత్యక్ష విమాన సేవల పునరుద్ధరణ నేపథ్యంలో శీతాకాలపు షెడ్యూల్‌లో వాటిని కొనసాగించడానికి ఇండిగోతో చర్చలు జరుగుతున్నాయని కేంద్ర పౌర విమానయాన మంత్రి పేర్కొన్నారు. తూర్పు ప్రాంత పౌర విమానయాన మంత్రుల సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రధాన బి-మాన్ కార్యక్రమం కింద ఒడిశా విమానయాన రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రధాన కార్యక్రమాలను ఆవిష్కరించారు.

- విమానయానంలో సాధికారత సాధన కోసం రాష్ట్రం నుంచి గిరిజన బాలికలను విమాన పైలట్లుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.
- స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రపంచ స్థాయి నిర్వహణ, మరమ్మత్తు మరియు ఓవర్‌హాల్ (ఎంఆర్‌ఓ) కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఎయిర్ వర్క్స్‌తో ఒప్పందం కుదిరింది. ఈ సౌకర్యం స్థానిక యువతకు శిక్షణ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ఆవిష్కరిస్తుంది.
- గత 14 నెలల్లో ఒడిశా విమానాశ్రయాలు 15 కొత్త గమ్యస్థానాలకు అనుసంధానించబడ్డాయి. ఈ అనుసంధానం జాతీయ, అంతర్జాతీయ విమానయాన పరిధిని విస్తరించనుంది. పూరీ, రౌర్కెలా, పారాదీప్‌లో విమానాశ్రయాల అభివృద్ధి, ఉడాన్ పథకం పొడిగించారు.
- ఢెంకనాల్ జిల్లా బిరషా ప్రాంతంలో ప్రపంచ స్థాయి విమానయాన శిక్షణా కేంద్రం రాబోతోంది. ఈ కేంద్రం ఏర్పాటుతో రాష్ట్రంలో విమాన శిక్షణ, యూఏవీ శిక్షణ, ఎయిర్ స్పోర్ట్స్ సౌకర్యాలు ఏర్పాటుకానున్నాయి.
- ఝార్సుగుడలో పెరుగుతున్న ప్రయాణికులు, కార్గో ట్రాఫిక్‌ను నిర్వహించడానికి విమానాశ్రయ విస్తరణ కోసం భూసేకరణ పూర్తయింది.
- విమానాయన అనుసంధానం లేని జిల్లాల్లో 14 కొత్త విమానాశ్రయాలు, 15 హెలిపోర్ట్‌ల అభివృద్ధి చేపడతారు. నిరుపయోగంగా పడి ఉన్న ఎయిర్‌స్ట్రిప్‌లను క్రియాత్మక విమానాశ్రయాలుగా అభివృద్ధి చేస్తారు.



ఎంఆర్‌ఓ కేంద్రం ఏర్పాటుకు ఎయిర్ వర్క్స్‌తో అవగాహన ఒప్పందం

అందరికీ విమానయానం: మంత్రి

భువనేశ్వర్: ఆకాశయానం అందరికీ అందుబాటులోకి తేవాలనే దృఢ సంకల్పంతో నరేంద్ర మోది నేతృత్వంలో భారత ప్రభుత్వం వికసిత్ భారత్ - 2047 కార్యాచరణని చురుగ్గా నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో భారతీయ విమానాశ్రయాలు రవాణా కేంద్రాలుగా పరిమితం కాకుండా ప్రయాణికుల ఉన్నత అనుభవాల శక్తివంతమైన కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. తూర్పు ప్రాంత పౌర విమానయాన మంత్రుల సమావేశం ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. ఆయనతో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, పౌర విమానయాన శాఖ మంత్రి మురళీధర్ పాల్గొన్నారు. సమావేశానికి ఛత్తీస్‌గఢ్, ఒడిశా, బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, అండమాన్ - నికోబార్ తూర్పు ప్రాంతాల రాష్ట్ర పౌర విమానయాన విభాగం ప్రతిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పిల్లల ఆటల కేంద్రాన్ని ప్రారంభించారు. విమాన ప్రయాణ సౌలభ్యం విస్తరణలో భాగగా పిల్లలకు ఆనందకరమైన అనుభవాన్ని కల్పించేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందన్నారు. విమానాశ్రయంలో ఫ్లైబ్రరీ ప్రారంభించారు. గ్రంథాలయంలో ప్రయాణికులు పుస్తకాల్ని విరాళంగా అందజేయడం, పుస్తకం తీసుకునేందుకు సౌకర్యాలు కల్పించారు.



విమానాశ్రయంలో పిల్లల ఆటల కేంద్రం ప్రారంభించిన మంత్రి

జగన్నాథ పాలక మండలి సభ్యునిగా గిరీష్ చంద్ర



భువనేశ్వర్ : భారత మాజీ కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ (కాగ్) డాక్టర్ గిరీష్ చంద్ర ముర్ము పూరీ జగన్నాథ ఆలయ పాలక మండలి సభ్యునిగా నియమితులయ్యారు. ఈయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రముఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. పలు ప్రభుత్వ శాఖల్లో కీలక అధికారిగా పనిచేశారు. డాక్టర్ గిరీష్ చంద్ర ముర్ముతో పాటు 10 మంది సభ్యులతో కూడిన శ్రీ మందిరం పాలక మండలి ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర న్యాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎ.కె.సాబత్, మహేష్ కుమార్ సాహు, డాక్టరు సిద్దేశ్వర మహాపాత్రో(ముక్తి మండపం ప్రతినిధి), రఘుబీర్ దాస్ మహారాజ్, బలారమ్‌కోట్ మఠం అధిపతి (మఠాల వర్గీయ ప్రతినిధి), కృష్ణ చంద్ర సామంత్రాయ్, మధుసూదన్ సింగారి, జగన్నాథ్ పూజాపండా, గణేష్ దాస్ మహాపాత్రో, రామనారాయణ గొచ్చికర్(సేవాయత్ ప్రతినిధులు) సభ్యులుగా ఉన్నారు.

పాలనలో పారదర్శకత



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్, అధికారులు

మల్కన్‌గిరి: పాలనలో పారదర్శకతను తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మన శాసనం అనే కొత్త వ్యవస్థను మంగళవారం ప్రారంభించింది. ప్రభుత్వ కార్యాలయాల్లో వృత్తిపరమైన ధోరణి, ప్రవర్తనలో మార్పు తీసుకురావడం ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశం. లోక సేవ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మన వ్యవస్థ పోర్టల్‌ను ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్ ప్రారంభించారు. ఇకపై జిల్లాలో 8 విభాగాల్లో ప్రజలు తమ సమస్యలను 91-7400221903 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్‌లు సోమానాథ్ ప్రధాన్, వేద్బర్ ప్రధాన్, డీపీఆర్ ప్రమిళా మాఝి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఉద్యోగుల సమ్మె విరమణ

పర్లాకిమిడి: రాష్ట్ర వ్యాప్తంగా ఒడిషా రాష్ట్ర రెవెన్యూ మినీస్టీరియల్ ఉద్యోగులు 15 రోజులుగా కలెక్టరేట్‌ల వద్ద జరుపుతున్న సమ్మెను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విరమించినట్టు జిల్లా రెవెన్యూ అమలా సంఘం కార్యదర్శి సంతును పాఢి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగుల సంఘాలకు తీవ్ర హెచ్చరికలు చేసిన నేపథ్యంలో 15 రోజుల పాటు జరిపిన మాస్ లీవ్‌ను రద్దు చేశారు. వారి ప్రధాన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ఆదేశాలు ఇవ్వడంతో మంగళవారం రెవెన్యూ ఉద్యోగులు ఆందోళన విరమించారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

రాయగడ: చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు కాసీపూర్ పోలీసులు మంగళవారం తెలిపారు. అరెస్టయిన వారిలో సిరిపాయి పంచాయతీ పరిధి అంబాబలేరి గ్రామానికి చెందిన అమీష్ మాఝి, గజేంద్ర గౌడోలు ఉన్నారన్నారు. వారివద్ద నుంచి ఒక బంగారు గొలుసు, 9,800 రూపాయల నగదును స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించామన్నా మన్నారు. ఈ నెల 21వ తేదీన అంబాబలేరి గ్రామంలో నివసిస్తున్న నాథొ గౌడో ఇంట్లో చోరీ. ఈ మేరకు బాధితుడు కాసీపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

రూ. 1.75 లక్షల చోరీ



చోరీకి గురైనట్టు చెబుతున్న బాధితుడు ఎస్.సాహు

రాయగడ: బ్యాగులో ఉన్న 1.75 లక్షల రూపాయల నగదును గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన స్థానిక కపిలాస్ కూడలిలో చోటు చేసుకుంది. కొలనార సమితి ముకుందపూర్ గ్రామానికి చెందిన ఎస్.సాహు ఈ మేరకు సదరు పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. సోమవారం మధ్యాహ్నం స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ నుంచి తన ఖాతాలో 1.75 లక్షల రూపాయల నగదును విత్ డ్రా చేసిన తరువాతలో బ్యాగులో ఉంచి బైకుపై వెళుతున్నాడు. ఈ క్రమంలో స్థానిక కపిలాస్ కూడలిలోని ఓ దుకాణంలో బైకును నిలిపి లోపలకు వెళ్లి తిరిగి వచ్చేసరికి బైకుకు ఉన్న బ్యాగ్ చోరీకి గురైంది. సీసీ కెమెరాల ఫుటేజ్ అనంతరం స్థానిక పోలీసులు దుండగులను గుర్తించే ప్రయత్నం చేశారు. కేసు నమోదు చసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఇసుక లారీలు

రాయగడ: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలోని వంశధార నది నుంచి ఇసుకను లారీల్లో తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గుమడ పోలీసులు ఆకస్మిక దాడులను నిర్వహించారు. ఈ దాడుల్లో ఇసుకతో ఉన్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నారు. కొద్ది రోజులుగా వంశధార నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులను నిర్వహించిన పోలీసులు సామవారం రాత్రి నది తీర ప్రాంతంలో ఉన్న రెండు హైవా లారీను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వోఎంసీ అధికారులకు సమాచారం అందించారు.

విమానాశ్రయంలో స్వల్ప ధరలకు అల్పాహారం

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉడాన్ యాత్రి కేఫ్ మంగళవారం ప్రారంభమైంది. ఈ కేంద్రంలో సరసమైన ధరలకు నాణ్యమైన అల్పాహారం అందుబాటులోకి వచ్చింది. టీ రూ.10, కాఫీ రూ.20, తాగునీరు రూ.10, సమోసా రూ.20, మిఠాయి పొట్లాం రూ.20లకు లభిస్తాయి.

10 నుంచి క్రీడా ఉత్సవాలు



సమావేశంలో పాల్గొన్న బీడీఓ, ఐఐసీ తదితరులు

రాయగడ: సెప్టెంబర్ 10 నుంచి బిసంకటక్‌లో జిల్లా స్థాయి క్రీడా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు బిసంకటక్ సమితి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో తీర్మానం చేశారు. బీడీఓ శివప్రసాద్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తహసీల్దార్ కె.వేంకటేశ్వర్ రెడ్డి, ఐఐసీ సూర్య చంద్ర పాడి, డాక్టర్ హరిహర బలదేవ్ టుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హేమంత కుమార్ దిపి తదితరులు పాల్గొన్నారు. 33 ఏళ్ల క్రితం బిసంకటక్‌లో జిల్లా స్థాయి క్రీడా ఉత్సవాలు నిర్వహించారు. ఆ తర్వాత అనివార్య కారణాల వల్ల పోటీలు జరగలేదు. ఈ ఏడాది అందరి సహకారంతో సెప్టెంబర్ 10 నుంచి 12 వరకు పోటీలు నిర్వహిస్తామని బీడీఓ తెలిపారు. జిల్లాలోని 11 సమితుల నుంచి క్రీడాకారులు హాజరవుతారని, 80 మంది క్రీడా అధ్యాపకులు పర్యవేక్షిస్తారని చెప్పారు. బిసంకటక్ మినీ స్టేడియంలో ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు.

జయపురం కవికి 'తెలుగు తేజం' అవార్డు



జయపురం: జయపురం కవి, పాత్రికేయుడు సింహాద్రి శ్రీనివాసరావుకు శ్రీశ్రీ కళావేదిక 'తెలుగు తేజం' అవార్డును ప్రకటించింది. వ్యవహారిక తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్న తెలుగు భాషాదినోత్సవంలో భాగంగా 'తెలుగు తేజం' పురస్కారంతో సత్కరించనున్నట్లు మంగళవారం ఆహ్వానం పంపింది. తెలుగు భాషాభివృద్ధికి సేవలు అందిచే వారికి అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక ప్రతీ ఏడాది 'తెలుగు తేజం' అవార్డుతో సన్మానిస్తుంది. ఆదివారం పల్నాడు జిల్లా నరసారావుపేట కొత్త రఘురామయ్య కళాశాల ఆడిటోరియంలో జరిగే తెలుగు భాషా దినోత్సవాల్లో ఒడిశా రాష్ట్రం జయపురం వాసి, రచయిత శ్రీనివాస రావు తెలుగు తేజం అవార్డుకు ఎంపిక కావటం ఉత్కలాంధ్రులకు గర్వకారణమని పలువురు సాహితీ ప్రియులు, మిత్రులు అన్నారు.

సుపరిపాలనే లక్ష్యం



అమ్మొ శాసన్ వ్యవస్థ ఆవిష్కరణోత్సవంలో సీఎం మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: సామాన్య ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పర్యవేక్షించి సుపరిపాలన సాగించే దిశగా పనిచేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం అమ్మొ శాసన్ వ్యవస్థని ప్రవేశ పెట్టినట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో అమ్మొ శాసన్ వ్యవస్థను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా పాలన సాగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ వ్యవస్థ, ప్రజల మధ్య మంచి సంబంధాన్ని ఏర్పరచడం, ఉన్నత ప్రజా సేవలను సకాలంలో కల్పించడం, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా అమ్మొ శాసన్ కొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించిందన్నారు. ప్రజలు వాట్సాప్ చాట్ (+91-7400221903), వెబ్‌సైట్ చాట్‌బాట్, టోల్-ఫ్రీ నంబర్ 14471 ద్వారా సాధారణ ప్రజలు వివిధ ప్రభుత్వ సేవలపై తమ అభిప్రాయాలను నేరుగా తెలియజేయవచ్చన్నారు.

విపత్తులపై అప్రమత్తం



సమీక్ష నిర్వహిస్తున్న గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు

భువనేశ్వర్ : రాష్ట్రంలో పలుచోట్ల నదులు ఉప్పొంగి వరదలు సంభవిస్తున్న నేపథ్యంలో విపత్తు నిర్వహణ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు ఆదేశించారు. రాజ్ భవన్ కాన్ఫరెన్సు హాలులో రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారితో సమావేశమై చర్చించారు.

వరద నీరు సద్వినియోగం కావాలి..

వరద నీటితో ఉప్పొంగుతున్న నదులు, ఇతరేతర జలాశయాల్లో నీటిని నీటి ఎద్దడి ప్రాంతాలకు మళ్లించి సాగునీరుగా బహుళార్ధ ప్రయోజనాలకు సద్వినియోగం చేసుకోవాలని అనుబంధ యంత్రాంగానికి గవర్నర్ సూచించారు. అనుకూలమైన ప్రాంతాల్లో బ్యారేజీలను నిర్మించి, మిగులు నీటిని మెరుగైన వినియోగం కోసం మళ్లించాలన్నారు. వరద పరిస్థితులను నియంత్రించి జలాశయాల పునరుద్ధరణకు దోహదపడుతుందన్నారు. అంతర్ రాష్ట్ర నదీ పరీవాహక అనుసంధానం దిశలో అడుగులు వేయాలన్నారు. వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలను రక్షించడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రముఖ కార్యదర్శి, ప్రత్యేక సహాయ కమిషనర్ దేవ్ రంజన్ సింగ్, అదనపు ప్రముఖ కమిషనర్ మనీష్ అగర్వాల్, ఇంజనీర్ ఇన్ చీఫ్, జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలకు విశేష స్పందన

జయపురం: ఈ నెల 31వ తేదీన జరుగనున్న స్వయం పాలన దినోత్సవం సందర్భంగా జయపురం మున్సిపాలిటీలో గల వివిధ పాఠశాలల విద్యార్థులకు వివిధ పోటీలను మంగళవారం నిర్వహించారు. స్థానిక నెహ్రూనగర్‌లో గల తెలుగు సాంస్కృతిక సమితి వారు జయపురం సిటీ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో 150 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్స్ విద్యార్థుల మధ్య జరిగిన వక్తృత్వ పోటీల్లో అరవింద నగర్ శిశుమందిర విద్యార్థి రుచి పాల్ ప్రథమ స్థానం, శారదా శిశుమందిర విద్యార్థి తితిక్ష మిశ్ర, విజ్ఞాన విద్యాలయం విద్యార్థి రితిజ రియశ్రీ సుబుద్ధి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వక్తృత్వ జూనియర్ విద్యార్థుల్లో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థి సుమిత్ర పండా, శారదా విహార్ సరస్వతీ శిశుమందిర్ విద్యార్థి ప్రతిక్ష ప్రధాన్, మోడరన్ ఇంగ్లీష్ పాఠశాల విద్యార్థి ప్రియంశీ పండా వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. చిత్రలేఖన పోటీల్లో కేంద్ర విద్యాలయం విద్యార్థి శ్వేకృతి త్రిపాఠీ ప్రథమ, ఎక్స్ బోర్డు మహమ్మద్ పాఠశాల విద్యార్థి ఫాజియ ఫాతిమ ద్వితీయ, సునారి వీధి ప్రాథమిక పాఠశాల విద్యార్థి పి.యషిత, సిటీ ఇంగ్లీష్ పాఠశాల విద్యార్థి అభశ్రీ పట్నాయక్ తృతీయ స్థానాల్లో నిలిచారు. సిటీ ఆంగ్ల పాఠశాల విద్యార్థి దేవాంశు పట్నాయక్, పబ్లిక్ స్కూల్ విద్యార్థి అక్షయ రథ్‌లు ప్రత్యేక బహుమతులకు ఎంపికయ్యారు. క్విజ్ పోటీల్లో విక్రమదేవ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు కృష్ణ సాగరియ, అరుణ మిశ్ర ప్రథమ, ద్వితీయ, మోడరన్ ఇంగ్లీషు పాఠశాల విద్యార్థి స్వాభిమాన్ స్వైయిన్ తృతీయ స్థానంలో నిలిచారు. మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత పర్యవేక్షించారు.



జూనియర్ వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



సీనియర్ వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం బంజీరుపేట గ్రామానికి చెందిన సిమ్మ సింహాచలం(59) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. కోటబొమ్మాళి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు సింహాచలం ఈనెల 22వ తేదీన తనకు ఉన్న అర్థిక ఇబ్బందులు కారణంగా ఇంట్లో ఉన్న నిద్రమాత్రలు అధిక మొత్తంలో మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అది గుర్తించిన అతని భార్య వరలక్ష్మి హుటాహుటిన 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనపై కోటబొమ్మాళి ఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్‌ తనిఖీలు



కొత్తూరు గ్రోమోర్‌ సెంటర్‌లో తనిఖీలు

శ్రీకాకుళం క్రైమ్‌/కొత్తూరు/హిరమండలం: జిల్లాలోని కొత్తూరు, హిరమండలం మండలాల్లో ఎరువుల దుకాణాల్లో మంగళవారం విజిలెన్స్‌ తనిఖీలు చేపట్టారు. కొత్తూరులోని మన గ్రోమోర్‌ సెంటర్‌లో రికార్డులు సక్రమంగా లేకపోవడంతో 16.95 టన్నుల కాంప్లెక్సు ఎరువుల అమ్మకాల నిలుపుదల చేసినట్లు విజిలెన్స్‌ ఎస్పీ బి.ప్రసాదరావు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్‌ ఇన్‌స్పెక్టర్‌ సతీష్‌కుమార్‌, ఏఓలు సంధ్య, స్వర్ణలత, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ ఎర్రన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీసీఎఫ్‌ బృందం పర్యటన

సంతబొమ్మాళి: తీరప్రాంత మత్స్యకారుల జీవనోపాధి భద్రతను పెంపొందించేందుకు గ్రీన్‌ క్లెమేట్‌ ఫండ్‌ (జీసీఎఫ్‌) బృందం, ఈసీఆర్‌ఐసీసీ ప్రాజెక్టు బృందం మరువాడ గ్రామాన్ని మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడారు. ప్రతికూల వాతావరణం పరిస్థితులను అధిగమించే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు వివిధ ఉపాధి మార్గాలను సూచించారు. సముద్రపు నాచుసాగు, అలంకరణ చేపల పెంపకం, ఆల్చిప్పల పెంపకం, పీతల పెంపకం వంటి కార్యకలాపాల ద్వారా మత్స్యకార కుటుంబాల ఆదాయం పెంచవచ్చని బృందం సభ్యులు వివరించారు. ఈ రంగాల్లో ఉచిత శిక్షణతో పాటు ఆర్థిక సహకారం అందిస్తామని ఢిల్లీ నేచురల్‌ రిసోర్స్‌ మేనేజ్‌మెంట్‌ సభ్యుడు మహ్మద్‌ రఫీ తెలిపారు.

జూనియర్‌ అసిస్టెంట్లుగా పదోన్నతులు

అరసవల్లి: జిల్లా పరిషత్‌ యాజమాన్యంలో పనిచేస్తున్న పలువురు రికార్డు అసిస్టెంట్లను జూనియర్‌ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ జెడ్పీ చైర్‌పర్సన్‌ పిరియా విజయ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మురపాక జెడ్పీ స్కూల్‌ రికార్డు అసిస్టెంట్‌ డి.రమాదేవిని వంగర మండలం ఎంఎస్‌ఆర్‌ పురం జెడ్పీ స్కూల్‌ జూనియర్‌ అసిస్టెంట్‌గా, లింగాలవలస రికార్డు అసిస్టెంట్‌ కె.హేమలతను అమలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు, గోవిందపురం రికార్డు అసిస్టెంట్‌ పి.జయలక్ష్మిని వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరు జెడ్పీ స్కూల్‌కు, బోరుభద్ర జెడ్పీ స్కూల్‌ రికార్డు అసిస్టెంట్‌ ఎ.గోపాలరెడ్డిని సంతబొమ్మాళి మండల పరిషత్‌ కార్యాలయానికి, ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట జెడ్పీ స్కూల్‌ రికార్డు అసిస్టెంట్‌ కె.పద్మలతను పాతపట్నం పీఆర్‌ఐ సబ్‌ డివిజన్‌ జూనియర్‌ అసిస్టెంట్‌గా పదోన్నతులు కల్పిస్తూ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, సి–సెక్షన్‌ సూపరింటెండెంట్‌ రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

కవిటిలో కార్డన్‌ సెర్చ్‌

కవిటి: మండల కేంద్రం కవిటి కొత్తకాలనీలో మంగళవారం పోలీసులు వేకువజాము నుంచి ఉదయం వరకు కార్డన్‌ సెర్చ్‌ చేపట్టారు. గంజాయి, మత్తు పదార్థాల అమ్మకాలు, అక్రమ రవాణాపై ఆరా తీశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టామని ఎస్‌ఐ వి.రవివర్మ తెలిపారు. వాహనదారులకు అన్ని ధ్రువ పత్రాలు ఉండాలని స్పష్టం చేశారు.

ఆర్గానిక్‌ కెమిస్ట్రీ కోర్సు మంజూరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో కొత్తగా మొదటిసారిగా బీఎస్సీ ఆర్గానిక్‌ కెమిస్ట్రీ సింగిల్‌ మేజర్‌ కోర్సు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు మంజూరైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.శ్రీరాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్మా, కెమికల్‌ సంస్థలు, పరిశ్రమల్లో స్థిరపడేందుకు ఆసక్తి చూపించే శ్రీకాకుళం జిల్లా విద్యార్థుల కోసం ఈ కోర్సును అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్‌ పోర్టల్‌లో కోర్సును విద్యార్థులు ఎంపిక చేసుకోవచ్చని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 90307 68474 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పోక్సో కోర్టు ఎస్పీపీగా విశాలాక్షి

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: జిల్లా కేంద్రంలోని పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా నగరానికి చెందిన న్యాయవాది జీవీఎస్‌యూ విశాలాక్షి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్‌ కార్యదర్శి ఉత్తర్వులను మంగళవారం విడుదల చేశారు. ఈమె ఈ పోస్టులో మూడు సంవత్సరాలు ఉంటారు.

ముంచేసిన వాన

- గజపతి జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు
- మూడు పంచాయతీల్లో ప్రజల అవస్థలు



పర్లాకిమిడి:నిత్యావసర వస్తువులను తీసుకువెళుతున్న మహిళలు



పర్లాకిమిడి: కాశీనగర్‌లో వెలవెలబోతున్న గణేష్‌ మండపం



పర్లాకిమిడి:మహేంద్రతనయ నదిలో చేరిన వరద



పర్లాకిమిడి: మోహనా బ్లాక్‌ చాందిపుట్‌ పంచాయతీలో బంకిజోలా, జోకరాపల్లి గ్రామస్తుల అవస్థలు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మోహనా సమితిలో కకావికలమైంది. చాందిపుట్‌ పంచాయతీలో మూడు గ్రామాలు బంకీజోలా, ఛోడియాపడా, జోకరాపల్లి గ్రామాల ప్రజలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. నిత్యావసర వస్తువులు, మందుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాడు సహాయంతో ప్రమాదకర పరిస్థితుల్లో నది దాటాల్సి వస్తోందని బంకీజోలా గ్రామస్తులు వాపోతున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బడికి దూరమవుతున్నారు. గజపతి జిల్లాలో మంగళవారం పర్లాకిమిడిలో అత్యధికంగా 68.0 మిల్లీమీటర్లు వర్షం కురవగా, కాశీనగర్‌లో 50 మి.మీ., రాయఘడలో 41.2, గుమ్మాలో 61, మోహనాలో 10.2, గుసానిలో 48.0, నువాగడలో 34.2 మి.మీ. వర్షం కురిసింది. పర్లాకిమిడి శివార్లలో గజపతినగరం, మొక్కతోటమ్మ కాలనీ వద్ద ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. ఓడ్రాఫ్‌ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

మల్కన్‌గిరిలో భారీ వర్షం

- **లోతట్టు ప్రాంతాలు జలమయం**

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు, నదుల్లో నీటిమట్టం పెరిగింది. పంట పొలాలు నీటమునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొద్ది రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సమాచారంతో మల్కన్‌గిరి జిల్లాకు అధికారులు రెడ్‌ అలర్ట్‌ జారీ చేశారు. మంగళవారం జిల్లా యంత్రాంగం అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించారు. లోతట్టు ప్రాంతవాసులకు పునరవాసం కల్పించారు. వర్షాం కారణంగా మంగళవారం మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో జరగాల్సి వారపు సంతను నిలిపివేశారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు అందుబాటులో ఉండాలని అన్నిశాఖల అధికారులను కలెక్టర్‌ సోమేశ్‌ ఉపాధ్యాయ్‌ ఆదేశించారు.

గజపతి జిల్లాలో..

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మహేంద్రతనయ, కాశీనగర్‌ వద్ద వంశధార నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో దక్షిణ ఒడిశాలోని కోరాపుట్‌, రాయగడ, మల్కన్‌గిరి, గజపతి జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో ఏడు సమితి కేంద్రాల్లో రికార్డు స్థాయిలో 339 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వంశధారలో ప్రమాద సూచిక 54.6 మీటర్లు కాగా కాశీనగర్‌లో 50.0 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో ప్రమాదస్థాయిలో లేదని సీడబ్ల్యూసీ (సెంట్రల్‌ వాటర్‌ కమిషన్‌) అధికారులు తెలియజేశారు. అయితే వర్షాల వల్ల వినాయక చవితి ఉత్సవాలపై ప్రభావం పడింది. గణేష్‌ విగ్రహాలు విక్రయాలు జరగకపోవడంతో కళాకారులు నష్టపోయారు.



పర్లాకిమిడి: వర్షంతో చెల్లని గణేష్‌ విగ్రహాలు



మల్కన్‌గిరిలోని పాఠశాల ఆవరణలోకి చేరిన వరద



పర్లాకిమిడి: సెంచూరియన్‌ వర్సిటీ క్యాంపస్‌లో పడుతున్న వర్షం

పేదలకు అందని సంక్షేమ పథకాలు

– పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జయపూర్‌ ఎమ్మెల్యే తారా ప్రసాద్‌ బాహిణీపతి



కొరాపుట్‌: రాష్ట్ర ప్రభుత్వం కేవలం గత పథకాల పేర్లు మార్చడంతోనే కాలం గడుపుతోందని, పేదలు, అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదని జయపూర్‌ ఎమ్మెల్యే, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తారా ప్రసాద్‌ బాహిణీపతి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడారు. గత బీజేడీ ప్రభుత్వంలో ఉన్న పథకాలను ఇప్పటివరకు 24 పథకాల పేర్లు మార్చి కొనసాగిస్తున్నారన్నారు. ఇలా పథకాల పేర్లు మార్చడం కన్నా రాష్ట్రంలో మహిళలకు రక్షణ, యువతకి ఉపాధిపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం ప్రతిపక్షంగా కాంగ్రెస్‌ మాత్రమే సరైన పాత్ర వహిస్తోందన్నారు. ఏడాదిన్నర కాలంగా కాంగ్రెస్‌ ప్రజాపోరాటాలతో ప్రజలకు దగ్గరైందన్నారు. పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్‌ దాస్‌ రాకతో పార్టీలో నూతన ఉత్సాహం వచ్చిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 30 జిల్లాలు ఉండగా.. పార్టీ పరంగా 35 జిల్లాలను గుర్తిస్తున్నామన్నారు. 35 మంది డీసీసీ అధ్యక్షుల నియామకం ప్రజాభిప్రాయానికి అనుకూలంగా జరుగుతుందన్నారు. ఇందులో పైరవీలకు అవకాశం లేదన్నారు.

తొలిపూజకు సర్వం సిద్ధం



మట్టి విగ్రహాలను విక్రయిస్తున్న దృశ్యం



వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న బ్రాహ్మణ సేవా సమాజం సభ్యులు

రాయగడ: వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, యువకులు సిద్ధమయ్యారు. వివిధ రూపాల్లో గణనాథులు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక మెయిన్‌ మార్కెట్‌ రద్దీగా మారింది. మట్టి వినాయక విగ్రహాలకు గిరాకీ ఏర్పడింది. ఇంటిలో తయారీ చేసిన మట్టి విగ్రహాలను స్థానిక మార్కెట్‌లో అమ్మకాలు జోరుగా సాగాయి. మండపాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు వినాయక ప్రతిమలను వాహనాల్లో తరలించారు. ఉత్కళ బ్రాహ్మణ సేవా సమాజానికి చెందిన సభ్యులు బాలాజీనగర్‌లో గల కల్యాణ వేంకటేశ్వర ఆలయం ప్రాంగణంలో నిర్వహించనున్న వినాయక ఉత్సవాల కోసం విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లారు.

కన్యాకుమారి.. డైరెక్టర్‌ మనోడే మరి

- 'కన్యాకుమారి' చిత్ర దర్శకుడు సృజన్‌ సిక్కోలువాసి
- శ్రీకాకుళం పరిసరాల్లోనే మొత్తం షూటింగ్‌

నరసన్నపేట: తెలుగు రాష్ట్రాల్లో విడుదలకు సిద్ధమైన 'కన్యాకుమారి' సినిమా డైరెక్టర్‌, నిర్మాత సృజన్‌ అట్టాడ మన సిక్కోలు వాసి. మొదటి సినిమా పుష్పక విమానంతో సత్తాచాటిన సృజన్‌ ద్వితీయ ప్రయత్నంగా కన్యాకుమారిని తెరకెక్కించారు. శాలిహుండం కొండపై వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రథమ పూజ చేసి సినిమా షూటింగ్‌ ప్రారంభించారు. నరసన్నపేట, పోలాకి మండలాల్లోని కోమర్తి, ఉర్లాం, చింతువానిపేట, లింగాలపాడు, దూకులపాడు, మాకివలస, దేవాది, మడపాం, రాళ్లపాడు, మబగాం, వీఎన్‌ పురం, శ్రీముఖలింగం గ్రామాల్లోనే దాదాపుగా సినిమా షూటింగ్‌ చేశారు. అలాగే కళింగపట్నం తీరంలో కొన్ని షాట్లు తీశారు. శ్రీకాకుళంలోని ఒక వస్త్ర షోరూంలో హీరోయిన్‌ గీత్‌ షైనీపై సన్నివేశాలు చిత్రీకరించారు. స్థానిక యాసతోనే హీరో హీరోయిన్ల సంభాషణలు ఉండడం విశేషం. దర్శకుడు అట్టాడ సృజన్‌ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు కుమారుడు. బుధవారం వినాయకచవితి సందర్భంగా సినిమా రిలీజ్‌ చేస్తున్నారు.

శ్రీకాకుళం అందాలను చూపించాం

సినిమా షూటింగ్‌లకు శ్రీకాకుళం జిల్లా చాలా అనుకూలంగా ఉంది. శ్రీకాకుళం చుట్టూనే సినిమా అంతా తీశాం. శ్రీకాకుళం జిల్లాలో పల్లె అందాలను చూపించనున్నాం. హీరోగా శ్రీ చరణ్‌ , హీరోయిన్‌గా గీత్‌ షైనీ నటించారు. ఇక్కడి యువతీ యువకుల మధ్య సాగే ప్రేమకథే ఈ సినిమా.

– సృజన్‌, దర్శకుడు



వీఎన్‌ పురం వద్ద సినిమా షూటింగ్‌ సమయంలో షాట్లును హీరో, హీరోయిన్‌లతో కలసి పరిశీలిస్తున్న డైరెక్టర్‌(ఫైల్‌)

జాతీయ ఉపాధ్యాయుడిగా బసంత్‌ కుమార్‌ రణా

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని కందేల్‌ ప్రభుత్వఉన్నత ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బసంత్‌ కుమార్‌ రణా జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ సోమేశ్‌ ఉపాధ్యాయ్‌ను తన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బసంత్‌ కుమార్‌ రణాను కలెక్టర్‌ అభినందించారు. జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకుకొచ్చారని కొనియాడారు. కాగా సెప్టెంబర్‌ ఐదో తేదీన ఢిల్లిలోని విజ్ఞాన్‌ భవన్‌లో నిర్వహించే టీచర్స్‌ డే వేడుకల్లో బసంత్‌ కుమార్‌ రణా పురస్కారం స్వీకరించనున్నారు.



బసంత్‌ కుమార్‌ను జ్ఞాపికతో అభినందిస్తున్న కలెక్టర్‌ సోమేశ్‌ ఉపాధ్యాయ్‌



పరిశోధనలకు ప్రోత్సాహం..!

శ్రీకాకుళం న్యూకాలనీ:

పరిశోధనల వైపు పాఠశాల, ఇంటర్‌ విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. జాతీయ విద్య పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) వారు 9, 10 మరియు ఇంటర్‌ ఫస్టియర్‌ విద్యార్థులను పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో ప్రోత్సహించడానికి ప్రయాస్‌ (ప్రమోషకన్‌ ఆఫ్‌ రీసెర్చ్‌ ఆటిట్యూడ్‌ అమాంగ్‌ యంగ్‌ అండ్‌ ఆస్పైరింగ్‌ స్టూడెంట్స్‌) పథకానికి రూపకల్పన చేశారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ, పీజీ(లీడ్‌) కళాశాలలోని సెంటర్‌ ఫర్‌ అప్లయిడ్‌ సైన్సెస్‌ విభాగం (బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ), ఇండిజీనస్‌ సొసైటీ ఫర్‌ ఫ్రుగల్‌ సైన్స్‌ ఇన్వెన్‌సన్‌ (ఐఎస్‌ఎఫ్‌ఎస్‌ఐ)ల ఉమ్మడిగా సహకారంతో ప్రయాస్‌ను విద్యార్థులకు చేరువ చేసేందుకు శ్రీకారం చుట్టారు.

నైపుణ్యాలను పెంచేలా...

పరిశోధనల వైపు ఆకర్షితులుగా ఉన్న విద్యార్థులను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రయాస్‌ను ఎన్‌సీఈఆర్‌టీ తెరపైకి తీసుకొచ్చింది. యువ, జిజ్ఞాస కలిగిన విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడమే ఈ పథకం ఉద్దేశం. పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించేలా చేసేందుకు ఎంపికైన విద్యార్థుల బృందానికి ప్రాజెక్ట్‌ సన్నద్ధత, రూపకల్పన చేసేందుకుగాను రూ.50 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేయనున్నారు. ప్రస్తుత వాస్తవ ప్రపంచంలో ఉన్న సమస్యలను ఆధారంగా చేసుకొని, వాటికి సృజనాత్మక, శాస్త్రీయ పరిష్కారాలను చూపించే ఆసక్తి గల విద్యార్థులకు ఈ ప్రయాస్‌ పథకం చక్కని వేదికగా ఉపయోగపడనుంది. 9వ తరగతి నుంచి ఇంటర్‌ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. ఆసక్తి గల పాఠశాలలు, కళాశాలల నుంచి ఇద్దరు విద్యార్థులు, ఒక అధ్యాపకుడిని ఒక బృందంగా ఎంపిక చేయనున్నారు. పరిశోధనల వైపు ఆసక్తి కలిగినవారు ఈనెల 28లోగా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల (లీడ్‌) కళాశాలను సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 85559 11961 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కణితి శ్రీరాములు సూచించారు.



శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల (ఇన్‌సెట్లో) ఎన్‌సీఈఆర్టీ లోగో

నైపుణ్యాలను పెంచడమే లక్ష్యం



యువ, జిజ్ఞాస కలిగిన విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తి పెంపొందించడమే ప్రయాస్‌ పథకం ముఖ్య లక్ష్యం. ప్రస్తుత వాస్తవ ప్రపంచ సమస్యలను ఆధారంగా చేసుకొని, వాటికి సృజనాత్మకత జోడించి, శాస్త్రీయ పరిష్కారాలను చూపించడం దీని ఉద్దేశం.

– **డాక్టర్‌ మధమంచి ప్రదీప్‌**, కళాశాల అప్లయిడ్‌ సైన్సెస్‌ హెచ్‌వోడీ, ఐఎస్‌ఎఫ్‌ఎస్‌ఐ అధ్యక్షుడు

సద్వినియోగం చేసుకోవాలి



ఎన్‌సీఈఆర్టీ రూపొందించిన ప్రయాస్‌ కార్యక్రమం చాలా గొప్పగా ఉంది. 9, 10 మరియు ఇంటర్‌ ఫస్టియర్‌ విద్యార్థులను పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో ప్రోత్సహించడానికి ఉపయోగపడుతుంది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– **డాక్టర్‌ కణితి శ్రీరాములు**, ప్రిన్సిపాల్‌, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల (లీడ్‌)కాలేజీ

ఈనెల 28లోగా సంప్రదించాలి



పాఠశాల/కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు, ఒక అధ్యాపకుడు బృందంగా ఏర్పడాలి. ఒక వినూత్న ఆలోచనతో కళాశాల అప్లయిడ్‌ సైన్సెస్‌ విభాగాన్ని సంప్రదించాలి. ఈ బృందాన్ని ప్రోత్సహించడానికి కళాశాల తరుపున సిద్ధంగా ఉన్నాం. ఈనెల 28లోగా కళాశాలను సంప్రదించాలి.

– **డాక్టర్‌ రోణంకి హరిత**, బయో టెక్నాలజీ సీనియర్‌ లెక్చరర్‌, ఐఎస్‌ఎఫ్‌ఎస్‌ఐ కార్యదర్శి

15 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదాతలను ప్రశంసా పత్రాలతో సత్కరిస్తున్న అతిథులు



రక్తదానం చేస్తున్న యువకుడు

జయపురం: జయపురం సబ్‌డివిజన్‌ బొరిగుమ్మలోని భైరవ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. భైరవి డిగ్రీ కళాశాల యాజమాన్యం, సంబాద–అమో ఒడిశా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని బొరిగుమ్మ డవలప్‌ మెంట్‌ ట్రస్ట్‌ అధ్యక్షులు రామచంద్ర పాఢీ, భైరవ డిగ్రీ కళాశాల అధ్యక్షులు కె.నాగరాజుదొర శిబిరాన్ని ప్రారంభించగా.. 15 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. రక్తదానం మహోన్నతమైనదన్నారు. అర్హులందరూ తరచూ రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలన్నారు. జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రి రక్తబండార్‌ టెక్నీషియన్‌లు శుభశ్రీ మిశ్ర మిశ్ర, బులు గౌఢ, స్నేహ శిక్షా గ్లోష్‌, హితేష్‌ ప్రధాన్‌ దాతల నుంచి రక్తం సేకరించారు. భైరవ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ సౌమేంద్ర స్వైయ్‌, కళాశాల అధ్యాపకులు చిరంజీవి పట్నాయక్‌, సంతోషినీ పాఢీ, ఉమామహేశ్వరి, దేవేంద్రనాథ్‌ పండ, జగదీష్‌ పాణిగ్రహి, గణేష్‌ పొలాయ్‌, అభిషేక్‌ రవుత్‌, పి.గుప్తేశ్వరరావు, లక్ష్మీరాణి పండ సహకరించారు. రక్తదాతలను నిర్వాహకుల సత్కరించారు.

సౌండ్‌ సిస్టం పరికరాలు చోరీ

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో కొలుమూరు చంద్రశేఖర్‌కు చెందిన రూ.1.20 లక్షలు విలువ చేసే సౌండ్‌ సిస్టం పరికరాలు చోరీకి గురైయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. కొన్ని రోజులు క్రితం శ్రీకాకుళం రూరల్‌ మండలం పొన్నాడ గ్రామానికి చెందిన ఒక యువకుడు తనకు తల్లిదండ్రులు ఎవరూ లేరని చెప్పి, పని కల్పించి భోజనం, కొంతకూలి ఇస్తే సరిపోతుందని కోరాడు. దీంతో ఆ యువకుడికి పని కల్పించి పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు సప్లయర్స్‌, సౌండ్‌ సిస్టం ఏర్పాటు చేసేందుకు చంద్రశేఖర్‌ తీసుకెళ్లేవాడు. అప్పటినుంచి నమ్మకంగా ఉంటూ పరికరాలు ఉన్నచోటే రాత్రిపూట పడుకునే వాడు. అయితే ఈ నెల 24న ఆ యువకుడితో ఉన్న మరో యువకుడికి మద్యం తాగించాడు. అనంతరం అర్ధరాత్రి తర్వాత గోడౌన్‌లో ఉన్న సీసీ కెమెరాల వైర్లు కట్‌ చేసి రూ.1.20 లక్షలు విలువ కలిగిన సౌండ్‌ సిస్టం సామగ్రి దొంగిలించుకుని పోయినట్లు ఆయన తెలిపారు. దీనిపై సారవకోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

క్లుప్తంగా

29న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

సాలూరు: ఈ నెల 29 న సాలూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఉషశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. దివిస్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మేళా శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని అన్నారు.ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9440537105 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్థాయి పారా త్రోబాల్ పోటీలకు సచివాలయం ఉద్యోగి


జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన శ్రీను

కొత్తవలస: మండలంలోని గనిశెట్టిపాలెం గ్రామ సచివాలయంలో డిజిటల్ సహాయకుడిగా పనిచేస్తున్న పాటిపిరెడ్డి శ్రీను జాతీయ స్థాయి పారా త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఒక ప్రకటనలో మంగళవారం ఆయన తెలిపారు.ఈ నెల 8వ తేదీన విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రీను ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా శ్రీనును పలువురు అభినందించారు.

4.8 కేజీల గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయి, నిందితులు

సంతకవిటి: మండలంలోని పొనుగుటివలస పరిధిలోని జీఎమ్ఆర్ఐటీ కళాశాల ఎదురుగా గల మామిడి తోటలో సోమవారం సాయంత్రం 4.8కేజీల గంజాయిని పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేరకు నలుగురు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. పాలకొండ ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని సోమవారం రాత్రి కేసు నమోదు చేసి మంగళవారం వారిని అంపోలు సబ్‌జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు.

సాలూరులో 5.60 కిలోల గంజాయి..

సాలూరు: పట్టణంలో ఇద్దరు వ్యక్తుల నుంచి గంజాయిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ పాత బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారని అందిన సమాచారం మేరకు వారి వద్దకు వెళ్లి విచారణ చేస్తున్న క్రమంలో తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఆ వ్యక్తుల బ్యాగుల్లో 5.60 కేజీల గంజాయిని గుర్తించామని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశామని, నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

ఏనుగుల గుంపుతో జాగ్రత్త

కొమరాడ: మండలంలోని కోటిపాం పరిసరాల్లో ఉన్న పంట పొలాల్లో తొమ్మిది ఏనుగుల గుంపు సంచరిస్తోంది. అయితే కోటిపాం గ్రామస్తులు సాయత్రం ఆరుగంటల నుంచి తెల్లవారు జామున ఆరు గంటల వరకు బయటకు రావద్దని జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూన మంగళవారం ఒక ప్రకటనలో తెలయజేశారు. బయటకు రావాల్సి వస్తే అటవీశాఖ సిబ్బంది సహాయం కోరాలని ఆమె సూచించారు.

అలరించిన సంగీత విభావరి

విజయనగరం టౌన్: స్థానిక ఘంటసాల స్మారక కళాపీఠంలో మంగళవారం రాత్రి జరిగిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులంతా అలనాటి మధుర గీతాలను ఆలపించి, వీక్షకులకు శ్రవణానందం కలిగించారు. కార్యక్రమంలో కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు, గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, సాయి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షురాలిగా ప్రభావతి

విజయనగరం టౌన్: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షురాలిగా పలుకూరి ప్రభావతి ఎన్నికయ్యారు. ఈ మేరకు స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో అభినందన సభ ఏర్పాటు చేసి, సంఘ సభ్యులు ఆమెను అభినందించారు.

లాటరీ ద్వారా ఫ్రీ సీట్లు కేటాయింపు

పూసపాటిరేగ: విద్యాహక్కు చట్టం ప్రకారం మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు అందివ్వాల్సిన ఫ్రీ సీట్లు లాటరీ ద్వారా మంగళవారం కేటాయించారు. ఈ మేరకు ఎంఈవో బి.పాపినాయుడు విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే రెండు విడతల్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సీట్లు అందించామని, తొలుత విద్యార్థి ఇంటికి రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోని పాఠశాలల్లో సీట్లు ఇచ్చామని, ఇప్పుడు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న వారికి విద్యాశాఖ ఆదేశాల మేరకు సీట్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మూడో విడతలో ఒకటో తరగతిలో మొత్తం 31 మంది విద్యార్థులకు సీట్లు ఇచ్చామన్నారు. ఈ నెల 31వ తేదీలోగా విద్యార్థులు కేటాయించిన పాఠశాలల్లో చేరాల్సి ఉంటుందన్నారు.

గిరిజనుల చెంతన విద్యా దీపం

- నెరవేరనున్న జగనన్న ఆశయం
- కేంద్రియ విశ్వ విద్యాలయానికి సొంత క్యాంపస్
- రూ.834 కోట్లతో సువిశాల ప్రాంగణంలో భవన నిర్మాణం
- ఇప్పటికే సిద్ధమవుతున్న అడ్మిన్, అకడమిక్ బ్లాక్ బిల్డింగ్‌లు
- వచ్చే విద్యా సంవత్సరానికి అంతా సిద్ధం


కేంద్రియ విశ్వవిద్యాలయ శంకుస్థాపనకు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి వస్తున్న నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

దత్తిరాజేరు: కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయనికి 2023 ఆగస్టు 25వ తేదీన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన చోటే శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి, గిరిజనుల జీవితాల్లో కాంతులు నింపాలంటే ఈ విద్యాదీపం నిబంధనల ప్రకారం వారి చెంతనే ఉండాలన్న కృత నిశ్చయంతో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. ప్రస్తుతం విజయనగరం శివారు గాజులరేగ వద్ద ఏయూ స్టడీ సెంటర్లో తాత్కాలికంగా కొనసాగుతోంది, ఈ ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థను ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన సాలూరు పరిధిలోని మెంటాడ మండలం, గజపతినగరం నియోజకవర్గం పరిధిలోని దత్తిరాజేరు మండలాల మధ్యలో చినచామలాపల్లి, మర్రివలస రెవెన్యూలో 561.88 ఎకరాల విస్తీర్ణంలో సువిశాలమైన ప్రకృతి రమణీయతతో చక్కని ప్రాంతంలో విద్యా సౌరభాలు విరబూయనున్నాయని ఈ ప్రాంత ప్రజలు, విద్యావేత్తలు ఆనందోత్సాహంలో ఉన్నారు. 120 అడుగుల వెడల్పు రోడ్డు పనులతో పాటు తరగతి భవనాలు(అకడమిక్ బ్లాక్) పరిపాలన భవనం (అడ్మిన్ బిల్డింగ్) బాలికలు, బాలురు వసతి గృహాలు రానున్న విద్యా సంవత్సరానికి పూర్తి చేయడానికి కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎప్పటికప్పుడు ఆరా తీస్తుండడంతో పనులు చక చకా జరుగుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు.


అకడమిక్ బ్లాక్

పూర్తిస్థాయిలో సౌకర్యాల కల్పన కోసం

కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయంలో తాగునీరు ఇతరత్రా నీటి అవసరాలను తీర్చేందుకు రూ.7 కోట్లతో డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ పనులు గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభమై పూర్తయ్యాయి. అలాగే పైప్‌లైన్ పనులు కూడా కొలిక్కి వస్తున్నాయి, మౌలిక వసతుల కల్పనకు నిధులు, రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారం చెల్లింపునకు గత ప్రభుత్వం హయాంలోనే రూ.61.06 కోట్లు మంజూరై పంపిణీ కూడా జరిగింది. రూ.16 కోట్లు అప్రోచ్ రోడ్డుకు డ్రైయిన్లు, అలాగే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం మరో రూ.48.61 లక్షలు కేటాయించింది. అప్పటికే ఆ భూముల్లో ఉన్న 220 కేవీ విద్యుత్ టవర్లు తొలగించడానికి రూ.12.43 లక్షలు మంజూరు చేయడంతో పనులు జరుగుతున్నాయి,

ఫలిస్తున్న నాయకుల కృషి

ఉత్తరాంధ్రకు పెద్ద దిక్కయిన రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత, అప్పటి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెనుకబడిన ప్రాంతంలో గిరిజన నియోజక వర్గానికి విద్యా కుసుమం లాంటి వర్సిటీ రావాలని అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గిరిజన శాఖ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరతో కలిసి ఒప్పించడంతో నేడు ఉమ్మడి జిల్లా విజయనగరంలో వర్సిటీ నిర్మాణం జరగడం శుభపరిణామమని పులువురు ప్రశంసిస్తున్నారు. వర్సిటీ ముఖద్వారం గజపతినగరం నియోజకవర్గం వైపు రావడంతో జాతీయ రహదారి మీదుగా రాక పోకలు సాగడానికి అప్పటి గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య చేసిన కృషిని నియోజకవర్గ, జిల్లా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. యూనివర్సిటీకి వైజాగ్. భోగాపురం ఎయిర్ పోర్టులు దగ్గరగా ఉండడం, కోమటిపల్లి, బొబ్బిలి రైల్వే స్టేషన్లు కూడా దగ్గరలో ఉండడంతో దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి విద్యను అభ్యసించేందుకు వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం చాలా దగ్గరగా ఉండడం గమనార్హం.


నిర్మాణంలో ఉన్న విద్యార్థుల వసతి గృహం


నిర్మాణం జరుగుతున్న వైస్ చాన్స్‌లర్ బంగ్లా


వేగవంతంగా జరుగుతున్న గెస్ట్‌హౌస్ నిర్మాణం

అర్హులకు కారుణ్య నియామకాలు

- హోంగార్డ్స్ కుటుంబాలతో ఎస్పీ మమేకం


హోంగార్డ్స్ కుటుంబాలతో సమావేశమైన ఎస్పీ, ఏఎస్పీ

విజయనగరం క్రైమ్: మృతిచెందిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. పోలీసు ఉద్యోగుల కుటుంబాల్లో అర్హత ఉన్న వారికి కారుణ్య నియామకాల కోసం చర్యలు చేపడతామని, ఎలాంటి సమస్యలున్నా, సందేహాలున్నా, సహాయం కావాలన్నా నేరుగా తనను కలవవచ్చని ఎస్పీ అన్నారు. మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబాలతో డీపీఓలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ మంగళవారం సమావేశమయ్యారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సర్వీసు బెనిఫిట్స్, వారి సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. మృతి చెందిన ఒక్కొక్క పోలీసు కుటుంబానికి పెండింగ్‌లో ఉన్న సర్వీస్ బెనిఫిట్స్, ప్రస్తుతం వాటి స్థితి, ప్రగతి, కుటుంబంలో అర్హత కలిగిన వ్యక్తులకు కారుణ్య నియామకాలు చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి కార్యాలయ అధికారులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబాలకు మినహా మిగిలిన వారికి అన్ని బెనిఫిట్స్ ఇప్పటికే అందజేశామని తెలిపారు. ఇంకనూ కొన్ని కుటుంబాలకు పెండింగ్‌లో ఏపీజీఎల్ఐ, జీఐఎస్, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్, పెన్షన్, భద్రత ఎక్స్‌గ్రేషియా వంటి బెనిఫిట్స్ మరణించిన పోలీసు కుటుంబాలకు త్వరితగతిన మంజూరు చేసేందుకు సంబంధిత అధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నామని ఎస్పీ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టేందుకు అర్హతలు కలిగిన వ్యక్తులు వెంటనే సర్టిఫికెట్లు జిల్లాపోలీసు కార్యాలయంలో అందజేస్తే, కారుణ్య నియామకాలకు చర్యలు చేపడతామన్నారు. కాగా ఇటీవల ట్రాఫిక్ పోలీసు స్టేషనులో విధులు నిర్వహిస్తూ హోంగార్డ్ పి.శ్రీనివాసరావు మరణించగా, వెల్ఫేర్ గ్రాంట్ కింద మంజూరైన రూ.15 వేల చెక్కును ఆయన సతీమణి పి.లక్ష్మీ ప్రసన్నకు ఎస్పీ వకుల్ జిందల్ అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డీపీఓ పరిపాలనాధికారి పి.శ్రీనివాసరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.గోపాల నాయుడు, ఆఫీసు సూపరింటెండెంట్లు టి.రామకృష్ణ, వెంకటలక్ష్మి, ఆర్ఎస్సై ప్రసాదరావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీనివాస రావు, జిల్లా పోలీసు కార్యాలయం ఉద్యోగులు, పోలీసు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

షెడ్యూల్ తెగలు, కులాల హక్కుల పరిరక్షణకు పటిష్ట చట్టాలు


మాట్లాడుతున్న న్యాయమూర్తి హేమస్రవంతి జానకి రామ్

బొబ్బిలి: షెడ్యూల్ తెగలు, కులాలకు చెందిన ప్రజల హక్కుల పరిరక్షణకు రాజ్యాంగం ఏర్పాటు చేసిన చట్టాలు పటిష్టమైనవని స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి హేమ స్రవంతి జానకిరామ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కోర్టు ఆవరణ, ఎస్సీ బాలికల వసతిగృహంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌర హక్కుల రక్షణచట్టం(1955)షెడ్యూల్ కులాలు, తెగల అత్యాచారాల నివారణ చట్టం(1989)ప్రకారం ఆయా ప్రజల హక్కులు కాపాడడం, అత్యాచారాలు, దురాగతాలను నివారించడం, హక్కుల కల్పన,పునరావాసం వంటివి కల్పించడం జరుగుతుందన్నారు. వారి కోసం ప్రత్యేక న్యాయ విచారణ జరుగుతుందని చెప్పారు. వారిపై జరిగే నేరాలు, దౌర్జన్యాలను అరికట్టేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి ఉపశమన చర్యలు తీసుకునేందుకు పటిష్టంగా చట్టాలున్నాయని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎం.ఆనందకుమార్, రుంకాన ప్రసాద రావు, పలువురు సీనియర్ న్యాయవాదులు, కక్షిదారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

విజయనగరం క్రైమ్: వినాయక పండగ ఏర్పాట్ల సందర్భంగా విజయనగరంలో మంగళవారం ప్రమాదం సంభవించింది. నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి దాసన్నపేట రైతు బజార్ వద్ద పదో తరగతి చదువుతున్న విద్యార్థి కరెంట్ షాక్ తగిలి మృతువాత పడ్డాడు. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..సారిపల్లికి చెందిన ముగ్గురు విద్యార్థులు వినాయక పండగ నేపథ్యంలో దాసన్న పేట వద్ద సామగ్రి కొనుగోలుకు వచ్చారు. సాయంత్రం వేళ వర్షం పడుతుండడంతో దాసన్నపేట రింగ్ రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఆ ముగ్గురు విద్యార్థుల్లో ఇద్దరు రెయిలింగ్ దాటిన తర్వాత మూడో బాలుడు రెయిలింగ్ పట్టుకుని దాటుతున్న సమయంలో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికుల సాయంతో బాలుడ్ని సమీపంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌గా తరలించగా వైద్యులు పరీక్ష చేసి మరణించాడని చెప్పారు.

ఎంపీఎఫ్‌సీ గొడౌన్‌లకు బిల్లుల చెల్లింపు


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: నిర్మాణాలు పూర్తయిన ఎంపీఎఫ్‌సీ (మల్టీ పర్పస్ ఫెసిలిటేటింగ్ సెంటర్) గొడౌన్‌లకు బిల్లుల చెల్లింపులకు ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సహకార శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ తన చాంబర్‌లో సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన జిల్లాలో నిర్మిస్తున్న ఎంపీఎఫ్‌సీ గొడౌన్‌ల పనులపై సమీక్ష చేశారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తయిన 11 గొడౌన్లకు ఫైనల్ పేమెంట్, ఒక గొడౌన్‌కు పార్ట్ ఫైనల్ పేమెంట్ కోసం ప్రతిపాదనలు పంపించాలన్నారు. పనులు మొదలుకాని గొడౌన్‌లకు అనుమతులు రద్దు చేయాలని తెలిపారు. మిగిలిన వాటి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా సహకార శాఖ అధికారి పి.రమేష్, డీసీసీబీ సీఈవో ఉమామహేశ్వరరావు, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, మార్కెటింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

విజయనగరం: తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. వర్షాలకు నగరంలో నీటమునిగిన ప్రాంతాలను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల వారికి ఇబ్బందులు ఏవైనా ఉంటే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరికైనా విపత్కర పరిస్థితులు ఎదురైతే సాయం కోసం ఫోన్ నంబర్ 9849906486ను సంప్రదించాలని కోరారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా

భోగాపురం: స్థానిక ఆదర్శ పాఠశాల సమీపంలోని జాతీయ రహదారిపై ఓ కారు బోల్తా పడినట్లు సీఐ దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. భార్యాభర్తలు తమ ఇద్దరు పిల్లలతో కలిసి కారులో విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్తుండగా భోగాపురం దగ్గరకు వచ్చేసరికి కారు ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడినట్లు వెల్లడించారు. ఈ ప్రమాదంలో భార్యకు తీవ్రగాయాలవ్వగా భర్త, ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా ఈ విషయం తెలుసుకుని ఘటన స్థలానికి వెళ్లామని, అప్పటికే క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. జేసీబీ సాయంతో కారును పక్కకు నెట్టి ట్రాఫిక్ అంతరాయం తొలగించామన్నారు.

ఉత్సవాలకు స్వయంభూ వినాయకుడు సిద్ధం

- ఈ ఏడాది ఐదురోజుల పాటు ఉత్సవాలు
- భూమిలో పుట్టిన 'మంతిన' శిలావినాయకుడిది ప్రత్యేకత


మంతినలో భూమిలోంచి పుట్టిన శిలావినాయకుడు

రాజాం/సంతకవిటి: వినాయక చవితి అనగానే మంటపాలు వేయడం, ప్రతిమలు తీసుకురావడం నిమజ్జనం చేయడం షరామామూలే. సంతకవిటి మండలంలోని మంతిన గ్రామంలో నారాయణపురం కుడి కాలువ పక్కనే ప్రతిష్ఠించిన వినాయకుడికి ఈ చవితి పండగలో విశిష్టత ఉంటుంది. ఇక్కడ వినాయకుడికి గుడి కూడా ఉంది. 1960లో నారాయణపురం కుడికాలువ తవ్వుతున్న సమయంలో భూమిలోంచి రాతి(శిల) వినాయకుడి ప్రతిమ గ్రామస్తులకు లభించింది. అప్పట్లో ఈ ప్రతిమను కాలువ పక్కనే ఓ రావిచెట్టు వద్ద గ్రామస్తులు ప్రతిష్ఠించారు. అప్పటినుంచి ప్రతి ఏడాది ఇక్కడ వినాయకచవితికి గ్రామస్తులు పూజలు, వ్రతాలు నిర్వహిస్తారు. ఐదు రోజుల నుంచి తొమ్మిదిరోజులు పాటు ప్రత్యేక పూజలు, దర్శన కార్యక్రమాలు ఉంటాయి. ఈ ఏడాది ఎప్పటిలాగానే ఐదు రోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సర్పంచ్ ఈశ్వరరావు తెలిపారు.

నాలుగు అడుగుల భారీ విగ్రహం

అప్పట్లో ఇక్కడ ప్రతిష్ఠించిన వినాయకుడి ప్రతిమ ప్రస్తుతం పెరిగిందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి ఏడాది ఈ విగ్రహ పరిమాణంలో మార్పు ఉంటుందని తెలిపారు. భారీ కాయం, బొజ్జతో ఇక్కడి రాతి విగ్రహం ఆకర్షణీయంగా ఉంటుంది. నాలుగు అడుగుల ఈ శిలా విగ్రహాన్ని ఒక్క ఇంచ్ కూడా కదపలేదు. ఇక్కడ ఉత్సవాల సమయంలో మట్టి వినాయకుడి ప్రతిమ తెచ్చి పూజలు చేసి, అనుపు పండగ నిర్వహిస్తారు. మంతిన గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తమ ఇళ్లలో ఏ శుభకార్యక్రమం జరిగినా ముందుగా ఇక్కడే పూజలు చేసి మొక్కులు చెల్లిస్తారు.

వెలుగులో చీకటి కోణం

- పక్కదోవ పట్టిన స్త్రీ నిధి డబ్బుల కలెక్షన్
- రేగులపాడు వీఓఏకు నోటీసులు ఇచ్చిన ఏపీఎం


వీరఘట్టం వెలుగు కార్యాలయం

వీరఘట్టం: మండలంలోని దశమంతుపురం గ్రామానికి చెందిన గ్రామ సంఘం సహాయకురాలు(వీఓఏ) ఇటీవల గ్రామ సంఘాల సభ్యుల నుంచి కలెక్షన్ చేసిన రూ.2 లక్షలు స్త్రీ నిధి డబ్బులు బ్యాంకులో జమచేయకుండా సొంత అవసరాలకు వాడుకుని, అధికారుల తనిఖీల్లో పట్టుబడ్డారు.ఈ డబ్బులు వెంటనే కట్టకపోతే ఆమెను విధుల నుంచి తొలగిస్తామని వెలుగు అధికారులు నోటీసులు ఇవ్వడంతో ఆమె దారిలోకి వచ్చారు. సొంత అవసరాలకు వాడుకున్న డబ్బులను చెల్లించేందుకు ఒప్పుకున్నారు.ఈ వ్యవహారం మరువక ముందే మరో వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు ఏపీఎం కె.రాము మంగళవారం మీడియాకు తెలిపారు.రేగులపాడు గ్రామానికి చెందిన వీఓఏ తమ గ్రామంలో గ్రామ సంఘాల నుంచి కలెక్షన్ చేసిన స్త్రీనిధి డబ్బులు సుమారు రూ.1.18 లక్షలు పక్కదోవ పట్టించినట్లు గుర్తించామన్నారు.వెంటనే స్త్రీనిధి లోన్ డబ్బులు కట్టకపోతే ఆమెను విధుల నుంచి తొలగిస్తామని నోటీసులు పంపించినట్లు ఏపీఎం రాము తెలిపారు. అన్ని గ్రామ సంఘాల అకౌంట్లు కొద్ది రోజుల్లో తనిఖీ చేస్తామన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. కొరవడిన పర్యవేక్షణ..

వీరఘట్టం మండలంలో 50 గ్రామ సంఘాలు ఉన్నాయి. వాటి పరిధిలో 1,752 స్వయం సహాయక సంఘాలు ఉండగా 17,683 మంది మహిళలు డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. వారికి స్త్రీ నిధి కింద రూ.28.12 కోట్లు రుణాలుగా ఇచ్చారు.ఈ రుణాలను వీఓఏలు డ్వాక్రా సంఘాల నుంచి కలెక్షన్ చేసి స్త్రీనిధి బ్యాంకు ఖాతాకు జమచేయాల్సి ఉంది. అయితే కొంత మంది డ్వాక్రా సంఘాల సభ్యుల నుంచి కలెక్షన్ చేసిన డబ్బులను బ్యాంకులకు సకాలంలో కడుతుండగా ఇంకొందరు సొంత అవసరాలకు వాడుకుని తర్వాత కడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.అయితే ఇంకొందరు పూర్తిగా చెల్లించకుండా అడ్డంగా దొరికిపోతున్నారు. వెలుగు అధికారులు పర్యవేక్షణ చేసి ఉంటే ఇటువంటి తప్పిదాలు జరగవని పలువురు అంటున్నారు.

> **అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు**
>
> 
>
> డ్వాక్రా సంఘాల సభ్యుల నుంచి కలెక్షన్ చేస్తున్న రుణాల రికవరీ డబ్బులను సకాలంలో బ్యాంకులో జమచేయాలి.అంతే తప్ప డ్వాక్రా సంఘాల మహిళల డబ్బులు సొంత అవసరాలకు వాడుకుని అక్రమాలకు పాల్పడితే అట్టివారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విధుల నుంచి తొలగిస్తాం.
>
> – కె.లలితకుమారి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

బదిలీ కోసం ఎంఈవో1ల నిరీక్షణ

- విద్యాశాఖ డైరెక్టర్‌కు లేఖ
- అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం


అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం

పార్వతీపురం టౌన్: ఎంఈఓ 1లకు సాధారణ బదిలీలు కూడా నిర్వహించినట్లైతే రాష్ట్ర వ్యాప్తంగా అందరు ఎంఈఓలకు ఉపయోగకరంగా ఉంటుందని ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ్ రామరాజుకు అసోసియేషన్ పక్షాన లేఖ రాసినట్లు ఆయన మంగళవారం తెలిపారు. 2017 నుంచి మెజారిటీ ఎంఈఓ1లు ఎనిమిదేళ్లుగా ఒకే చోట పని చేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఈఓ1 లు బదిలీల కోసం ఆశతో ఎదురు చూస్తున్న నేపథ్యంలో అంతర్ జిల్లా బదిలీలతో పాటు ఎంఈఓ 1, 2 లకు జీరో సర్వీస్ తో సాధారణ బదిలీలు కూడా నిర్వహించేందుకు తగిన ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా విద్యాశాఖ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు సామల సింహాచలంతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయక్ బుక్యా రవి నాయక్‌లు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేకు కేసు నమోదు చేశామని సీఐ నారాయణమూర్తి చెప్పారు. ఈ నెల 22న బర్మా కాలనీకి చెందిన విద్యార్థిని కళాశాలకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. తర్వాత తిరిగి ఇంటికి రాకపోవడంతో, ఆమె కోసం బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ తెలియక పోవడంతో మంగళవారం ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం

- బయటకు తీసిన పోలీసులు


గుర్తు తెలియన మృతదేహం


చెరువులోంచి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చుతున్న ఏఎస్సై జనార్దన్, కానిస్టేబుల్ రమేష్

కొత్తవలస: మండలంలోని కొత్తసుంకరపాలెం గ్రామం సమీపంలో గల దత్తుడు చెరువులో గుర్తు తెలియని మృతేహాన్ని స్థానికులు మంగళవారం చూసి పోలీసులకు తెలిపారు.ఈ మేరకు ఘటనా స్థలానికి ఏఎస్సై జనార్దన్ రావు, కానిస్టేబుల్ ఎల్.రమేష్ వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని చెరువులోనుంచి ఒడ్డుకు తీసేందుకు స్థానికులు ఎవరూ సహకరించకపోవడంతో ఏఎస్సై జనార్దన్, కానిస్టేబుల్ రమేష్‌లు సాహసించి చెరువులో దిగి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతి చెంది మూడు రోజులకు పైగా కావడంతో విపరీతమైన దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు దగ్గరికి చేరలేదు. పోలీసులే మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చి క్షుణ్ణంగా పరిశీలించారు. కాగా మృతుడి వయస్సు సుమారుగా 50 సంవత్సరాలకు పైగా ఉంటుందని అంచనా వేశారు. ప్రాణాలను పణంగా పెట్టి సాహసించిన ఏఎస్సై, కానిస్టేబుల్‌ను సీఐ అభినందించారు. శవ పంచనామా నిర్వహించి ఎస్.కోట సీహెచ్‌సీలోని మార్చురీకి మృతదేహాన్ని తరలించినట్లు సీఐ షణ్ముఖ రావు తెలిపారు.

సచివాలయ ఉద్యోగి దుష్ప్రవర్తన

గుర్ల: మండలంలోని నాగళ్లవలస సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి కల్యాణిపై డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీపతి దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం. పంచాయతీ కార్యదర్శి చెప్పిన పనులు చేయకుండా తనకు నచ్చిన పనిని చేస్తానని, ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణతో పాటు దాడులు చేయడానికి సిద్ధపడుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి కల్యాణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి సిద్ధం అవుతుండగా మండల అధికారుల సూచనలతో ఫిర్యాదు చేయలేదు. ఈ విషయంపై ఎంపీడీఓ రవికుమార్ వద్ద ప్రస్తావించగా నాగళ్లవలస డిజిటల్ అసిస్టెంట్ దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆయనకు మెమో ఇవ్వడంతో పాటు ఈ విషయాన్ని డీపీఓ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.